

బూమ్.. బ్యాంగ్..!

జిల్లాలో భిన్న వాతావరణ పరిస్థితులు జనాన్ని ఆశ్చర్యానికి, అయోమయానికి గురిచేస్తున్నాయి. పిడుగుపాటుకు మనుషులతోపాటు మూగ జీవాలు బలవుతున్నాయి. - 8లో..

చంద్రబాబు జమానాలోనే రైతులకు కరువు



చంద్రబాబు హయాంలోనే రైతులకు కరువు పరిస్థితులు వస్తాయని వైఎస్సార్‌ సీపీ ఒంగోలు ఇన్‌చార్జి చుండూరు రవి బాబు ధ్వజమెత్తారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

30న జిల్లాస్థాయి ఫుట్‌బాల్‌ జట్ల ఎంపిక

ఒంగోలు: జిల్లాస్థాయి ఫుట్‌బాల్‌ సబ్‌ జూనియర్, జూనియర్‌ బాల బాలికల క్రీడా జట్ల ఎంపిక ఈ నెల 30న స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్‌ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ కార్యదర్శి అంచిపోగు రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపిక ప్రారంభమవుతుందన్నారు. జూనియర్స్‌ విభాగంలో 2010 జనవరి నుంచి 2011 డిసెంబర్‌ మధ్య జన్మించిన వారు, సబ్‌ జూనియర్స్‌ విభాగంలో 2012 జనవరి నుంచి 2013 డిసెంబర్‌ మధ్య జన్మించిన వారు పాల్గొనేందుకు అర్హులన్నారు. ఎంపికకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాజట్లు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9849760566 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

2న వాలీబాల్‌ సెలక్షన్స్‌

ఒంగోలు: స్పోర్ట్సు అథారిటీ ఆఫ్‌ ఇండియా(సాయి) వాలీబాల్‌ క్రీడాకారుల ఎంపిక జూన్‌ 2న విశాఖపట్నం పోర్టు స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా వాలీబాల్‌ అసోసియేషన్‌ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి డాక్టర్‌ జి.ధనుంజయరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 190 సెంటీమీటర్ల కనీస ఎత్తు కలిగిన బాలురు, 170 సెంటీమీటర్ల కనీస ఎత్తు కలిగిన బాలికలు ఎంపికకు అర్హులు. ఎంపికైన బాలబాలికలకు ఉచిత వసతి, భోజనంతో పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ప్రభుత్వ వైద్యుని మెడికల్‌ ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్, 5 పాస్‌పోర్టు సైజు ఫోటోలు, స్పోర్ట్సు సర్టిఫికెట్లు తీసుకుని ఎంపిక కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 9490382802 నంబర్‌ను సంప్రదించాలని డాక్టర్‌ జి.ధనుంజయరావు విజ్ఞప్తి చేశారు.

సీనియారిటీ జాబితా సరిచేయాలి

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయులు పదోన్నతుల బదిలీకి సంబంధించి స్కూల్‌ అసిస్టెంట్‌ నుంచి గ్రేడ్‌–2 హెచ్‌ఎంగా పదోన్నతుల జాబితాలో అనేక పొరపాట్లు ఉన్నాయని, వాటిని సరిచేయాలని యూటీఎఫ్‌ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు మంగళవారం డిమాండ్‌ చేశారు. రూల్‌ ప్రకారం ఒకే డీఎస్సీలో నియామకం పొంది వివిధ సబ్జెక్టులకు పదోన్నతి పొంది ఒకే తేదీ జాయిన్‌ అయిన వారి ఇంటర్‌ సీనియారిటీ నిర్ణయించేటప్పుడు వారి సీనియారిటీ ఫీడర్‌ కేడర్‌ తీసుకురావాలన్నారు. ఈ నేపథ్యంలో స్కూల్‌ అసిస్టెంట్‌ నుంచి హెచ్‌ఎం పదోన్నతుల జాబితా సరిచేస్తామని డీఈఓ కార్యాలయం ప్రకటించింది. వెంటనే ఆ జాబితా సరిచేసి గ్రేడ్‌–2 హెచ్‌ఎంల పదోన్నతుల జాబితా విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు.

తాగునీటి చెరువులకే సాగర్‌ జలాలు

- ఎస్‌ఎస్‌పీ ఎస్‌ఈ నాగమురళీమోహన్‌



ఎన్‌ఎస్‌పి కాలువ 126వ మైలు వద్ద పరిశీలిస్తున్న ఎస్‌ఈ, సిబ్బంది

కురిచేడు:

నాగార్జున సాగర్‌ కుడి కాలువ ద్వారా విడుదల చేసిన నీరు కేవలం తాగునీటి అవసరాల కోసమేనని ఎన్‌ఎస్‌పీ ఎస్‌ఈ నాగమురళిమోహన్‌ తెలిపారు. మంగళవారం ఆయన సాగర్‌కాలువపై పరిశీలించారు. ఒంగోలు బ్రాంచికాలువ హెడ్‌ రెగ్యులేటర్, దర్శి బ్రాంచి కాలువ హెడ్‌రెగ్యులేటర్, త్రిపురాంతకం, జిల్లా సరిహద్దు 85/3 మైలు వరకు పర్యటించారు. ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులు, సిబ్బంది తమ తాగునీటి చెరువులను నింపుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్థానిక అట్లపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి అవసరాల కోసం కేవలం 4 టీఎంసీల నీరు మాత్రమే ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలకు కలిపి విడుదల చేశారని, వారం రోజుల్లో కాలువ నిలిపివేస్తారన్నారు. నోటిఫై చెరువులు మాత్రమే నింపుకోవాలని, అలా కాకుండా నీటి చౌర్యానికి పాల్పడితే క్రిమినల్‌ కేసులు పెడతామని హెచ్చరించారు. జిల్లా ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట ఈఈ రామకృష్ణ, డీఈఈ అక్బర్‌బాషా, ఏఈలు శ్రీకాంత్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, సాంబశివరావు, సిబ్బంది ఉన్నారు.

మాటలు వేడెక్కి.. నేతలు వీధికెక్కి!

తెలుగుదేశం మినీ మహానాడులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌.. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిపై చేసిన విమర్శలతో రేగిన చిచ్చు చల్లారడం లేదు. వారం రోజులుగా టీడీపీ, జనసేన నాయకులు పత్రికా సమావేశాలు ఏర్పాటు చేసి విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడం గమనార్హం. ఇరు పార్టీల నేతలు పరిధి దాటి పత్రికల్లో రాయలేని పదజాలంతో దూషణలకు దిగుతున్నారు. కుటుంబసభ్యులను సైతం ఇందులోకి లాగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- కూటమిలో తారస్థాయికి చేరిన విభేదాలు
- ఎమ్మెల్యే దామచర్ల విమర్శలతో రాజుకున్న చిచ్చు
- బాలినేనిపై విమర్శలు చేసినా పట్టించుకోని జనసేన నాయకులు
- బాలినేని అనుచరుడు జడా బాల నాగేంద్ర. టీడీపీ నాయకుల వ్యక్తిగత విమర్శలతో కాక
- రాయడానికి వీల్లేని భాషలో దూషించుకుంటూ వీధిన పడిన కూటమి నాయకులు
- వ్యక్తిగత విమర్శలపై మండిపడుతున్న జనం



సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ముందస్తు రుతుపవనాలతో జిల్లాలో వాతావరణం చల్లబడింది. అయితే మినీ మహానాడులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ చేసిన విమర్శలతో జిల్లా కేంద్రం ఒంగోలులో మాత్రం రాజకీయ వాతావరణం మాత్రం వేడెక్కింది. అప్పటి నుంచి గత వారం రోజులుగా టీడీపీ, జనసేన నాయకుల మధ్య విమర్శలు, ప్రతి విమర్శల పర్వం కొనసాగుతూనే ఉంది. దామచర్ల చేసిన విమర్శలకు ప్రతిగా జనసేన నాయకుడు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అనుచరుడు జడా బాల నాగేంద్ర ఎమ్మెల్యే దామచర్లపై విమర్శలు చేయడంతో కూటమిలో కుంపటి రాజుకుంది. అది ఈ విడత శృతి మించింది. టీడీపీ, జనసేన నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగడంతో మరింత వేడి రాజుకుంది. ఇరు పార్టీల నాయకులు పత్రికల్లో రాయలేని భాషలో తిట్టుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ తిట్లను వినలేక ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. అధికారం ఇచ్చి పరిపాలన చేయమంటే దాన్ని వదిలేసి కూటమి నాయకులు అసభ్య పదజాలంతో దూషించుకుంటూ రోడ్డున పడుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

దామచర్ల విమర్శలు వ్యక్తిగతమా...

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ అవకాశం చిక్కినప్పుడల్లా మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని విమర్శిస్తుండడం తెలిసిందే. ఈ క్రమంలోనే ఒంగోలులో జరిగిన మినీ మహానాడులో బాలినేనిపై తీవ్రమైన విమర్శలతో విరుచుకుపడ్డారు. ఒంగోలును సర్వనాశనం చేసి హైదరాబాద్‌ వెళ్లి ప్రశాంతంగా ఆడుకుంటున్నాడని విమర్శించారు. అంతేకాకుండా ఎక్కడ అరెస్టు చేస్తారోనన్న భయంతో హైదరాబాద్‌ పారిపోయి జనసేన పార్టీలో చేరాడని ఎద్దేవా చేశారు. అయినా జనసేన నాయకులు పెద్దగా స్పందించకపోవడం గమనార్హం. జనసేనలో మొదట్నుంచి రెండు గ్రూపులు ఉన్నాయి. అందులో జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్‌ రియాజ్‌ తొలి నుంచి దామచర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం ఉంది. ఇప్పుడు కూడా ఆయన దామచర్లతోనే కొనసాగుతున్నాడు. దాంతో బాలినేనిపై దామచర్ల చేసిన విమర్శలు పూర్తిగా వ్యక్తిగతమైనవని, దానికి పార్టీకి ఎలాంటి సంబంధం లేదని రియాజ్‌ చెబుతున్నారు. అంతేకాకుండా నిన్నా మొన్నటి వరకు జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధిగా చెప్పుకుంటూ తిరిగిన నాయకురాలు కూడా మౌనంగా ఉండడంతో తప్పనిసరి పరిస్థితిలో జడా నాగేంద్ర కౌంటర్‌ ఇచ్చారన్న ప్రచారం జరుగుతోంది.

దామచర్లకు కౌంటర్‌ ఇచ్చిన నాగేంద్ర...

ఎమ్మెల్యే దామచర్ల చేసిన విమర్శలకు జనసేన నాయకుడు జడా బాల నాగేంద్ర కౌంటర్‌ ఇచ్చారు. తెలుగుదేశం ఎమ్మెల్యే దామచర్ల కూటమి ధర్మాన్ని పాటించాలని హితవు పలికారు. గత ఎన్నికల్లో జనసేన మద్దతు వల్లనే దామచర్ల గెలిచాడని గుర్తు చేసిన ఆయన... బాలినేని ఏదో పార్టీలో చేరాడని విమర్శించడం అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. నీకు దమ్ముంటే రాజీనామా చేసి సొంతంగా బాలినేనిపై పోటీ చేసి గెలవాలని సవాల్‌ విసిరారు. 7 మంది పీఏలను పెట్టుకొని అవినీతికి పాల్పడుతున్నావని, నీ పాపాల చిట్టా లోకేష్‌ దగ్గర ఉందని ధ్వజమెత్తారు. ఒంగోలులో ఉద్యోగులు, వ్యాపారులు, కాంట్రాక్టర్లు, కార్మికుల వద్ద నుంచి జె.టాక్స్‌ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దాంతో కూటమిలో విభేదాలు తారస్థాయికి చేరాయి.

వ్యక్తిగత విమర్శలతో వీధిలో పడ్డ కూటమి నాయకులు...

ఈ రెండు ఘటన తరువాత టీడీపీ, జనసేన నాయకుల మధ్య విమర్శలు శృతి మించి రాగాన పడ్డాయి. ఒకరిపై మరొకరు వ్యక్తిగతంగా తిట్టుకోవడం మొదలుపెట్టారు. బాలినేని దయాదాక్షిణ్యాలపై నాగేంద్ర బతుకుతున్నాడంటూ పరుష పదజాలంతో టీడీపీ నాయకులు తిట్లదండకం అందుకున్నారు. డొక్కా సీతమ్మ అన్నదానం పేరుతో ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఆ వెంటనే రంగంలోకి దిగిన నాగేంద్ర సైతం అదే స్థాయిలో కౌంటర్‌ ఇచ్చారు. దొంగలు, కిరాయి హంతకులు, కాల్‌మనీగాళ్లతో ప్రెస్‌మీట్‌ పెట్టించి బెదిరించాలనుకుంటున్నారా అంటూ ఎమ్మెల్యే దామచర్లను ప్రశ్నించారు.

నగరపాలక సంస్థలోనూ ఇదే తంతు..

నగర కార్పొరేషన్‌లోనూ ఇదే తంతు కొనసాగుతోంది. వైఎస్సార్‌ సీపీ నుంచి టీడీపీ, జనసేన పార్టీలలో చేరిన కార్పొరేటర్ల మధ్య కూడా విభేదాలు భగ్గుమంటున్నాయి. టీడీపీలో చేరిన 14 మంది కార్పొరేటర్లు నగర మేయర్‌ గంగాడ సుజాత తీరుపై గుర్రుగా ఉన్నారు. మేయర్‌ను తొలగించాలని డిమాండ్‌ చేస్తున్నారు. సొంత పార్టీ కార్పొరేటర్లను కూడా వదిలిపెట్టడం లేదని, వారి నుంచి కూడా డబ్బులు గుంజేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కూటమి కార్పొరేటర్లు ఎడ్డెమంటే తెడ్డెమంటూ ఒకరి వెనక మరొకరు గోతులు తవ్వుకుంటూ అభివృద్ధి పనులను గాలికి వదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా నగరంలోని అనేక డివిజన్లలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. డివిజన్ల అభివృద్ధిపై దీని ప్రభావం కనిపిస్తుందని ప్రజలు మండిపడుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో అటవిక పాలన

- రాష్ట్రంలో రెడ్‌బుక్‌ రాజ్యాంగం
- తెనాలి ఘటనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా పోలీసుల ప్రవర్తన
- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌ ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంతి ఆదిమూలపు సురేష్, పక్కన నేతలు

ఒంగోలు సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో అటవిక పాలన సాగుతోందని, ఇందుకు తెనాలి ఘటనే నిదర్శనమని వైఎస్సార్‌ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌ ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌ బుక్‌ రాజ్యాంగాన్ని పోలీసులు పక్కాగా అమలు చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు పూర్తిగా రాజ్యాంగాన్ని విస్మరించి వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు, మరీ ముఖ్యంగా దళిత, మైనారిటీలను భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. తెనాలిలో మైనారిటీ, దళిత యువకులపై పోలీసులు చేసిన అమానుష ఘటనే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ పది నెలల కాలంలో దళితులు, మైనారిటీలు, మహిళలపై దారుణమైన ఘటనలు చోటు చేసుకుంటున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా పోలీసులు వ్యవహరిస్తున్నారనీ ఆరోపించారు. తెనాలిలో సభ్యసమాజం తలదించుకునేలా థర్డ్‌డిగ్రీ ప్రయోగిస్తూ ఒక సీఐ కాళ్లను తొక్కుతూ మరొక సీఐ లాఠీతో విరిగిపోయే వరకు కొడుతూనే ఉండటం చూస్తుంటే రాష్ట్రంలో రక్షణ ఏమాత్రం ఉందో అర్థమవుతుందన్నారు. యువకులు నేరం చేస్తే విచారణ చేయాలే గానీ నడిబజారులో దారుణంగా కొట్టడం ఏంటని ప్రశ్నించారు. ఈ సంఘటనను వైఎస్సార్‌ సీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ సంఘటనపై మానవహక్కుల సంఘం గానీ, ఎస్సీ కమిషన్‌ గానీ వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో దళితులపై రోజు రోజుకూ దాడులు తీవ్రతరం అవుతున్నాయన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌ నియోజకవర్గంలో ఇలాంటి సంఘటన జరిగిందని, దీనికి ఆయన సమాధానం చెప్పాలన్నారు. ఘటన బయటకు వచ్చినా ఇంత వరకు ఆ పోలీసులపై శాఖాపర చర్యలు తీసుకుంటామని ప్రకటించకపోవడం దారుణమన్నారు. టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని వైఎస్సార్‌ సీపీ నాయకులపై దాడులు చేసినా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే పరిస్థితి కనిపించడంలేదన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని మండిపడ్డారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను ఖండిస్తున్నామన్నారు. మాదిగ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ తెనాలిలో దళిత, మైనారిటీ యువకులపై పోలీసులు ప్రవర్తించిన సంఘటనతో రాష్ట్రంలో పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. దళితులకు, మైనారిటీలకు, మహిళలకు భద్రత కరువైందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనల పట్ల ప్రశ్నిస్తానని చెప్పి పార్టీ పెట్టి ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్‌కళ్యాణ్‌ నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. పవన్‌కళ్యాణ్‌ సొంత నియోజకవర్గంలోనే బహిష్కరిస్తే కనీసం అక్కడకు వెళ్లిన పాపాన పోలేదని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా పరిపాలించాల్సిన పాలకులు దళిత మైనారిటీలపై దాడులు జరుగుతుంటే కనీస స్పందన లేదని విమర్శించారు. సూపర్‌సిక్స్‌ అమలు చేయలేని టీడీడీకి మహానాడు జరుపుకునే అర్హత లేదన్నారు. ఇటువంటి సంఘటనలు జరుగుతుంటే దళిత హోంమంత్రి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. తెనాలి ఘటనపై తక్షణమే స్పందించి నిందితులైన పోలీసులపై చర్యలు తీసుకొని వారిని సస్పెండ్‌ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు.

ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్‌ మాట్లాడుతూ తెనాలిలో యువకులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం దళితులు, మైనారిటీలపై ఒక పథకం ప్రకారం దాడులు చేయిస్తోందన్నారు. గ్రామాల్లో అత్యంత దారుణ పరిస్థితులు ఉన్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయలేని కూటమి నేతలు ఇటువంటి ఘటన పట్ల మౌనంగా ఉండటం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వంలో దోచుకోవడం, దాచుకోవడం, పంచుకోవడం తప్ప ఇంకేం లేదన్నారు. తప్పుడు పనులు చేసే పోలీసులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఈ విషయాన్ని ప్రతి పోలీసు గుర్తు పెట్టుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న మాట్లాడుతూ యువకులను కిరాతంగా కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బడుగు ఇందిర, కార్పొరేటరు ఇమ్రాన్‌ఖాన్, మైనారిటీ సెల్‌ జిల్లా అధ్యక్షులు షేక్‌ సుల్తాన్‌భాషా, ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షులు దేవప్రసాద్, దర్శి నియోజకవర్గ ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు గల్లెపోగు ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరులో కూలిన భారీ వృక్షం

కూలిన వందేళ్ల భారీ వృక్షం

టంగుటూరు: రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 100 సంవత్సరాల నాటి భారీ వృక్షం కూలిన సంఘటన టంగుటూరు భారత్‌ పెట్రోల్‌ బంక్‌ సమీపంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్షానికి నాని నాని వృక్షం ఒక్కసారిగా మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో వాలింది. ఆ రోడ్డు మార్గాన నిత్యం ఆర్టీసీ బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు వందలాదిగా రాకపోకలు సాగిస్తుంటాయి. వృక్షం వాలిన సమయం మధ్యాహ్నం కావటంతో ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. ఒంటి గంట నుంచి నాలుగు గంటల వరకు వాహనాలను దారిమళ్లించారు. పంచాయతీ అధికారులు, పోలీసులు వాలిన భారీ వృక్షాన్ని తొలగించడంతో రాకపోకలు ఎప్పటిలాగే సాగాయి.

ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

- హౌసింగ్‌ స్పెషలాఫీసర్‌ అన్నపూర్ణ



అల్లూరు జగనన్న లేఅవుట్లు పరిశీలిస్తున్న హౌసింగ్‌ స్పెషలాఫీసర్‌ అన్నపూర్ణ

అల్లూరు (కొత్తపట్నం): మండలంలోని అల్లూరు గ్రామ పరిధిలోని జగనన్న లే అవుట్లను హౌసింగ్‌ స్పెషలాఫీసర్‌ ఎన్‌ అన్నపూర్ణ మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని నాలుగు జగనన్న లే అవుట్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఎస్టీలకు అదనంగా రూ.75 వేలు కేటాయిస్తే ఎందుకు ఇళ్లు నిర్మించుకోలేదని, ఎందుకు ఆలస్యం చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ నీటి వసతి లేకపోవడంతో నిర్మాణం ఆగిపోయిందని తెలిపారు. కాలనీలకు నీరు వచ్చేలా చూడాలని కోరారు. నాలుగు లే అవుట్లలో 193 గృహాలు మంజూరు కాగా 42 పూర్తయ్యాయని, శ్లాబ్‌ దశలో 14, బేస్‌మట్టం 95, మిగిలిన 42 వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. లే అవుట్లకు నీటి సౌకర్యం వెంటనే కల్పించాలని ఎంపీడీఓను ఆదేశించారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసరావు, హౌసింగ్‌ ఇన్‌చార్జి ఏఈ వలిరాజు, ఉప సర్పంచ్‌ తాటపర్తి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతుల సమస్యలపై పోరాటం

- ఆంధ్రప్రదేశ్‌ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య



జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

ఒంగోలు టౌన్‌: రాష్ట్ర మంత్రులు ఆర్భాటాలు చేయడం మానుకొని గిట్టుబాటు ధరలకు పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్‌ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. కృష్ణయ్య డిమాండ్‌ చేశారు. స్థానిక ఎల్బీజీ భవనంలో సోమవారం రైతు సంఘం జిల్లా కమిటి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జజ్జూరి జయంతి బాబు సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేసే చర్యల్లో భాగంగానే ప్రభుత్వం పొగాకు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కంపెనీలు సరైన ధరలు ఇవ్వకపోవడం, సక్రమంగా కొనుగోలు చేయకపోవడంతో ఇప్పటికే నల్లబర్లీ సాగు చేసిన నలుగురు పొగాకు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, అవసరమైతే పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పొగాకు రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా కాపాడాలని, ప్రభుత్వ రంగ సంస్థలతో పొగాకును కొనుగోలు చేయించాలని కోరారు. వర్జీనియా పొగాకు లో గ్రేడ్‌ రకాన్ని కంపెనీలు అసలు కొనుగోలు చేయడం లేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి రామారావు తెలిపారు. వర్జీనియా పొగాకు ధరలను తగ్గించేందుకు కంపెనీలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే బ్యారన్‌కు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నష్టం వస్తుందని వివరించారు. ప్రభుత్వం నేరుగా రంగంలోకి దిగి పొగాకును కొనాలని, రైతులను ఆదుకోవాలని డిమాండ్‌ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే బాబు మాట్లాడుతూ పొగాకు రైతులను ఆదుకునేందుకు పోరాటాలు చేస్తామని చెప్పారు. సమావేశంలో రైతు నాయకులు హనుమంతరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, బెజవాడ శ్రీనివాసరావు, కిష్షిపాటి చిన్నపరెడ్డి, కనపర్తి సుబ్బారావు, శ్రీకాంత్, ఉషా వెంకటేశ్వర్లు, సోమయ్య, ముప్పరాజు బ్రహ్మయ్య, సింగయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల గుర్తింపు వేగవంతం చేయండి

- కలెక్టర్‌ తమీమ్‌ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్‌ తమీమ్‌ అన్సారియా, జేసీ, డీఆర్‌ఓ

ఒంగోలు సబర్బన్‌: అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్‌ ఏ. తమీమ్‌ అన్సారియా మండల స్థాయి అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ప్రకాశం భవనం నుంచి మంగళవారం మండల స్థాయి అధికారులతో కలెక్టర్‌ వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, సీసీఆర్‌సీ కార్డుల మంజూరుపై క్షేత్ర స్థాయి అధికారులకు సూచనలు చేశారు. కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ, ఇతర ప్రయోజనాలు లభించడానికి సీసీఆర్‌సీ కార్డులే ప్రధానమైనందున రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో కౌలుదారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. వాస్తవ భూ యజమానుల హక్కులకు భంగం కలగకుండా సాగుదారులకు ప్రభుత్వ ప్రయోజనాలు లభించేలా చూడాలన్నారు. గ్రీవెన్స్‌ అర్జీల పరిష్కారంపై, రెవెన్యూ అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ సారించాలన్నారు. జాయింట్‌ కలెక్టర్‌ ఆర్‌. గోపాలకృష్ణ మాట్లాడుతూ సీబీజీ, ఎంఎస్‌ఎంఈ, ఇతర పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములను గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అర్హులైన వారు ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మ్యుటేషన్లు, ఇతర రెవెన్యూ సంబంధిత అంశాలపై ప్రతి నెలా మూడో సోమవారం ప్రభుత్వం ఐవీఆర్‌ఎస్‌ ద్వారా ప్రజాభిప్రాయం సేకరిస్తున్నందున ఎలాంటి లోపాలు లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు.



జిల్లాలో భిన్న వాతావరణ పరిస్థితులు జనాన్ని ఆశ్చర్యానికి, అయోమయానికి గురిచేస్తున్నాయి. అంతకు మించి భయాన్ని పుట్టిస్తున్నాయి.! అనూహ్య రీతిలో వాతావరణం మారిపోయి, ఆకాశంలో మబ్బులు కమ్మేయడం.. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. అదే సమయంలో పిడుగులు పడుతుండటంతో మనుషులతోపాటు మూగ జీవాలు బలవుతున్నాయి. పిడుగుల బారి నుంచి రక్షణ పొందాలంటే అప్రమత్తతే ఆయుధం. వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు జారీ చేస్తున్న హెచ్చరికలను అనుసరించడం అత్యంత ముఖ్యం.

బూమ్.. బ్యాంగ్!

- పిడుగుల ప్రతాపం ఏప్రిల్, మే, జూన్ మాసాల్లోనే అధికం
- గడిచిన నెలన్నర వ్యవధిలో దాదాపు 20 వరకు పిడుగుపాట్లు
- మనుషులతోపాటు మూగజీవాలు మృత్యువాత
- గృహోపకరణాలు దగ్ధమై భారీగా నష్టం
- పిడుగులు పడే ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్న వాతవరణ శాఖ
- గృహాలు, కార్యాలయాలపై లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు ముఖ్యం

పొన్నలూరు/కనిగిరి రూరల్: వేసవి కాలం అయినప్పటికీ బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావంతో ఇటీవల కాలంలో జిల్లా వ్యాప్తంగా అడపా దడపా వర్షాలు కురిశాయి. పలు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. ఈ క్రమంలోనే చెట్లు, నివాసాలు, ఖాళీ స్థలాలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఆలయాలపై పిడుగులు పడటంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. సాధారణంగా పిడుగుపాటు బారి నుంచి తప్పించుకోవడం దాదాపు అసాధ్యం. అయితే వర్షాలు కురిసే సమయాల్లో చెట్ల కింద, ఎత్తయిన ప్రదేశాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉంటే ప్రాణాలు కాపాడుకునేందుకు అవకాశం ఉంటుంది.

సమయ స్ఫూర్తి ఎంతో అవసరం..

వ్యవసాయ పనులు చేసేటప్పుడు ఉరుములు, మెరుపులు వస్తుంటే పిడుగులు పడతాయని భావించి రైతులు అప్రమత్తం కావాలి. వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. ఒక వేళ సురక్షిత ప్రాంతానికి వెళ్లే సమయం లేకుంటే సమయస్ఫూర్తితో వ్యవహరించి.. మోకాళ్లపై కూర్చుని చేతులు, తల నేలకు తగిలేలా ముడుచుకుని కూర్చోవాలి. దీని వల్ల సమీపంలో పిడుగు పడినా ఆ ప్రభావం తక్కువగా ఉండి ప్రాణాలతో బయటపడే అవకాశం ఉంటుంది. అలా కుదరని పరిస్థితిలో కాళ్లను భూమి మీద పూర్తిగా ఆనించకుండా, కాలి వేళ్లపై నిల్చునేందుకు ప్రయత్నించాలి.



పొన్నలూరు మండలం వెల్లటూరు నల్లవాగులో ఇటీవల పిడుగుపడి మృత్యువాతపడిన గొర్రెలు

లైట్నింగ్ కండక్టర్‌తో ప్రయోజనం

పిడుగుల నుంచి రక్షణ కోసం భౌతిక శాస్త్రవేత్త బెంజిమన్ ఫ్రాంక్లిన్ రాగి తీగలతో లైట్నింగ్ కండక్టర్ రూపొందించారు. వీటిని ఎత్తయిన భవనాలు, గుడి గోపురాలపై అమర్చేవారు. ఈ కండక్టర్ పిడుగుల్లోని విద్యుదావేశాన్ని గ్రహించి రాగి తీగల ద్వారా నేరుగా భూమిలోకి పంపిస్తుంది. ఈ క్రమంలో రాగి తీగలు కూడా కరిగిపోతుంటాయి. ప్రస్తుతం రాగి, కాంస్య మిశ్రమంతో రూపొందిచిన లైట్నింగ్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని కూడా ప్రజలు అవసరాన్ని బట్టి వినియోగించి పిడుగుల బారి నుంచి రక్షణ పొందవచ్చు.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- సాధారణంగా ఎత్తుగా ఉండే నిర్మాణాలు, ప్రాంతాలపై పిడుగులు ఎక్కువగా పడతాయి. అందువల్ల వర్షం కురిసే సమయంలో చెట్లు, సెల్ టవర్లు, విద్యుత్ స్తంభాలు, కొండల వద్దకు వెళ్లకూడదు.
- టీవీలు, రిఫ్రిజిరేటర్లు, విద్యుత్ కుక్కర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్‌లు, కంప్యూటర్లు, ఇతర విద్యుత్ పరికరాలు ఉపయోగించకూడదు.
- గుంపులు గుంపులుగా కాకుండా దూరంగా ఉండాలి.

ప్రథమ చికిత్స ఇలా..

- పిడుగుపాటుతో అస్వస్థతకు గురైన వారిని గాలి, వెలుతురు తగిలే విశాలమైన ప్రాంతంలో ఉంచాలి.
- తడి దుస్తులు తొలగించి పొడి దుస్తులు వేయాలి.
- తల ఒక వైపునకు తిప్పి, రెండు కాళ్లు కాస్త పైకి ఎత్తి ఉంచాలి.
- తాగు నీరు, ఆహార పదార్థాలు అందించకూడదు.
- అందుబాటులో ఉన్న వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించాలి.

జిల్లాలో పిడుగుల గర్జన

- ఏప్రిల్ 3న వెలిగండ్ల మండలం గుడిపాటిపల్లి పంచాయతీ కట్టకిందపల్లిలో బి.తిరుపాలుకు చెందిన సుమారు 10 జీవాలు పిడుగుపాటుకు మృతి చెందాయి.
- ఏప్రిల్ 4న కొమరోలు మండలం ఎడమకల్లులో ఎం.యాకోబుకు చెందిన మూడు గేదెలు చనిపోయాయి.
- ఏప్రిల్ 20న బేస్తవారిపేట మండలంలోని పెద్ద ఓబినేనిపల్లెలో క్రికెట్ ఆడుకునేందుకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు ఆకాష్, సన్ని పిడుగుపాటుతో మృత్యువాతపడ్డారు. గొర్రెల కాపరి తిరుపతయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.
- కొమరోలు మండలం తాటిచర్ల మోటులో గుమ్మళ్ల శింగరయ్యకు చెందిన రెండు గేదెలు, రెండు దూడలు పిడుగుపాటుకు చనిపోయాయి.
- ఏప్రిల్ 16న అర్ధవీడు మండలం యాచవరంలో పొలంలో పనిచేస్తున్న కూలీలపై పిడుగు పడటంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.
- ఏప్రిల్ 30న కంభంలోని హజరత్ గూడెంలో పిడుగుపాటుకు రెండు గేదెలు మృతిచెందాయి.
- మే 2న కనిగిరి మండలం కలగట్ల సమీపంలో నూకపోటి శివపార్వతమ్మకు చెందిన గొర్రెల మందపై పిడుగు పడి 20 మేకలు మృత్యువాతపడ్డాయి.
- మే 4న నాగులుప్పలపాడు మండలం ఈదుమూడికి చెందిన కొండపి నాగమల్లేశ్వరరావు పిడుగుపాటుతో మృతి చెందారు.
- మే 16న సింగరాయకొండ మండలం బేసిన్ పల్లెపాలెంలో రామాలయంపై పిడుగుపడి మూడు విగ్రహాలు ధ్వంసమయ్యాయి.
- మే 17న రాచర్ల మండలంలోని జేపీ చెరువు సమీపంలో పిడుగుపాటుకు 22 గొర్రెలు మృతి చెందాయి.
- ఇటీవల ముండ్లమూరు మండలంలో ఓ నివాసంపై పిడుగుపడటంతో చుట్టుపక్కల 12 ఇళ్లలో గృహోపకరణాలు దెబ్బతిని రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది.



కనిగిరి : కలగొట్లలో మృతి చెందిన మేకలు(ఫైల్)

మేఘాల్లో ధన, రుణావేశం పిడుగుల జననం

విరుద్ధ విద్యుదావేశాలున్న రెండు మేఘాలు ఢీకొన్నప్పుడు వాటి మధ్య జనించే శక్తినే పిడుగు అని పిలుస్తాం. ధ్వని వేగం కన్నా కాంతి వేగం ఎక్కువ కావడంతో ముందుగా మెరుపు కనిపిస్తుంది. తర్వాత ఉరుము శబ్దం వినిపిస్తుంది. తేమ విద్యుత్ ప్రవాహంగా పనిచేయడం వల్ల ధనావేశం ఉన్న విద్యుత్ శక్తి భూమిపై రుణావేశం గల ప్రదేశానికి క్షణాల వ్యవధిలో దూసుకొస్తుంది. పిడుగులు ఎత్తయిన ప్రదేశాలపై పడి భూమిలోకి తటస్థంగా వెళ్లిపోతాయి. సహజంగా భూమిపై చెట్లు ఎత్తుగా ఉండటం వల్ల పిడుగులు వాటిపైనే అధికంగా పడుతుంటాయి.

30,000 డిగ్రీల ఉష్ణం గంటకు 4.34 లక్షల కి.మీ వేగం

పిడుగులు పడే సమయంలో శక్తి విస్ఫోటనం చెంది అధిక ఉష్ణోగ్రత వెలువడుతుంది. వాతావరణ నిపుణుల అంచనా ప్రకారం పిడుగు పడినపుడు 50 వేల డిగ్రీల ఫారన్ హీట్ లేదా 30 వేల డిగ్రీల సెల్సియస్ ఉష్ణగ్రత విడుదల అవుతుంది. సుమారు 300 మిలియన్ వాట్ల విద్యుత్ జనిస్తుంది. గంటకు 4.34 లక్షల కిలోమీటర్ల వేగంతో పిడుగు భూమికి చేరుతుంది.

చెట్లకు దూరంగా ఉండాలి..



ప్రజలు వర్షం కురిసినప్పుడు చెట్ల దగ్గరకు వెళ్లకపోవడమే మంచిది. అలాగే వర్షం వచ్చేటప్పుడు సెల్ ఫోన్ వినియోగించడం కూడా మంచిది కాదు. విద్యుత్‌ను గ్రహించే వాటికి దూరంగా ఉండాలి. పిడుగుపాటుకు గురైతే వెంటనే స్పృహ కోల్పోతారు. ప్రథమ చికిత్సకు అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. పిడుగుపాటుకు గురైన వ్యక్తికి ధైర్యం చెప్పి వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ రవికిరణ్, పీహెచ్‌సీ, పొన్నలూరు

దళిత, ముస్లిం యువకులకు బహిరంగ శిక్ష దారుణం

పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య



డాక్టర్ మాదాసి వెంకయ్య

సింగరాయకొండ: టీడీపీ కూటమి ప్రభుత్వంలో దళితులు, మైనార్టీలపై దాడులు తీవ్రమయ్యాయనేందుకు గుంటూరు జిల్లా తెనాలిలో నడిరోడ్డుపై యువకులను పోలీసులు కొట్టడమే నిదర్శనమని, ఇది ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘనేనని పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య ఆరోపించారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో రోజూ దళితులు, మైనార్టీలపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని తెనాలి ఘటనే ఇందుకు పరాకాష్ట అని ప్రభుత్వ పనితీరును విమర్శించారు. పోలీసులు తమ దందాలకు సహకరించడం లేదని ఆ యువకులను అతిక్రూరత్వంగా, రాక్షసత్వంగా గాయపరిచారని, దీంతో ఆ ప్రాంత ప్రజలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలంటేనే భయపడుతున్నారన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల కుమారులు తప్పు చేస్తే ఈ విధంగా బహిరంగంగా శిక్షిస్తారా అని ప్రశ్నించారు. యువకులపై అతి కిరాతకంగా దాడి చేసిన పోలీసు అధికారులను కఠినంగా శిక్షించి, తక్షణమే సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



మృతురాలు వెంకటరత్నం

దర్శి(కురిచేడు): భర్త మందలించాడని మనస్తాపం చెందిన మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన దర్శి మండలంలోని తూర్పు వీరాయపాలెం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై మురళి కథనం మేరకు.. తూర్పువీరాయపాలెం గ్రామానికి చెందిన చెరుగూరి వెంకటరత్నం(30)ను సోమవారం రాత్రి అన్నం వండే విషయమై ఆమె భర్త బాల సుందరరాజు మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె మంగళవారం వేకువ జామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని, మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కంటైనర్ లారీ

- నలుగురు పచ్చాకు కూలీలకు తీవ్ర గాయాలు



క్షతగాత్రుడితో మాట్లాడుతున్న ఎస్సై నాగమల్లేశ్వరరావు

టంగుటూరు: ట్రాక్టర్‌ను లారీ ఢీకొనడంతో నలుగురు పచ్చాకు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన టంగుటూరు మండలంలోని సూరారెడ్డిపాలెం వద్ద జాతీయ రహదారిపై బాబాయ్ హోటల్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సూరారెడ్డిపాలెం గ్రామానికి చెందిన నల్లగొర్ల అశోక్ ట్రాక్టర్‌లో పచ్చాకుతో సహా కూలీలను తీసుకుని తూర్పునాయుడుపాలెం వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఒంగోలు వైపు నుంచి చెన్నై వైపు వెళ్తున్న కంటైనర్ లారీ పచ్చాకు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న వెంకటేశ్వర్లుకు కాలు విరగగా, జక్రయ్య, మార్కు, రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్సై నాగమల్లేశ్వరరావు పరిశీలించారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కంటైనర్ లారీ ఆగకుండా వెళ్లిపోగా పోలీసులు గాలించి బోదనం టోల్‌గేట్ సమీపంలోని చిల్లకూరు వద్ద సీజ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో నిందితుడు అరెస్టు

ముండ్లమూరు(కురిచేడు): గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడు నాగులూరి సిద్ధు అలియాస్ తిరుపతయ్యను మంగళవారం ముండ్లమూరులోని తాళ్లూరు రోడ్డులో వేయింగ్ బ్రిడ్జి వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. కేసు వివరాలను డీఎస్పీ మీడియాకు వెల్లడించారు. తిరుపతయ్య గతంలో కందుకూరు లాడ్జిలో బాయ్‌గా పనిచేస్తున్న సమయంలో గంజాయి అమ్ముతూ పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు. జైలులో జడ లక్ష్మీనారాయణ, జడ శ్రీహరి, మొగిలి వంశీ, ఉప్పు శివగోపితో పరిచయం ఏర్పడింది. తిరుపతయ్య జైలు నుంచి వచ్చిన తర్వాత ఒంగోలులోని సిందూర లాడ్జిలో పనిచేసే క్రమంలో జైలు సహచరులు గత ఏడాది నవంబర్‌లో 5 గంజాయి ప్యాకెట్లు ఇచ్చి అమ్మించారు. మళ్లీ ఈ ఏడాది ఫిబ్రవరి 21న జైలు సహచరులు గంజాయి ప్యాకెట్లు తీసుకుని తిరుపతయ్య వద్దకు వెళ్లే క్రమంలో ముండ్లమూరు పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి తిరుపతయ్య తప్పించుకుని తిరుగుతున్నాడు. తన జైలు సహచరులు విడుదలయ్యారని తెలిసి వారిని కలిసేందుకు తిరుపతయ్య మంగళవారం ముండ్లమూరు రాగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ వివరించారు.

క్లుప్తంగా


కారు, బైకు ఢీ.. ఒకరు మృతి



మృతి చెందిన వెంకటేశ్వర్లు

మార్కాపురం: బైకును కారు ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి అనంతపురం–అమరావతి జాతీయ రహదారిపై మిట్టమీదిపల్లి సమీపంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం ప్రకారం.. పెద్దారవీడు మండలం శివాపురం గ్రామానికి చెందిన పోతిరెడ్డి వెంకటేశ్వర్లు(30) తన బైక్‌పై కంభం వెళ్తున్నాడు. మహానంది నుంచి శ్రీశైలం వెళ్తున్న కారు తిప్పాయపాలెం–చింతకుంట్ల గ్రామాల మధ్య మిట్టమీదిపల్లి హైవే రోడ్డు దగ్గర బైకును ఢీకొనడంతో సంఘటన స్థలంలోనే వెంకటేశ్వర్లు మృతి చెందారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మార్కాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫారంపాండ్‌లో పడి యువకుడు మృతి



మృతుడు అఖిల్

యర్రగొండపాలెం: నీళ్ల కోసం వెళ్లి ఫారం పాండ్‌లో జారిపడి యువకుడు మృతి చెందిన సంఘటన స్థానిక మార్కాపురం రోడ్‌లోని హైవే రెస్ట్ హౌస్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వీరభద్రాపురం గ్రామానికి చెందిన ఆలేటి అఖిల్(23) రెస్ట్ హౌస్ సమీపంలో భవన నిర్మాణ పనికి వెళ్లాడు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు నీళ్లు తీసుకురావడానికి సమీప పొలంలో ఉన్న ఫారం పాండ్ వద్దకు చేరుకున్నాడు. నీరు పట్టుకునే క్రమంలో కాలుజారి పాండ్‌లో పడిపోయాడు. బయటకు రాలేక నీట మునిగి మృతి చెందాడని తోటి కార్మికులు చెప్పారు. అఖిల్ ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉన్నత విద్య కోసం వేచి ఉన్నాడు. వేసవి సెలవులు కావడంతో కుటుంబానికి ఆర్థికంగా చేదోడుగా ఉండేందుకు బేల్దారి పనులకు వెళ్తున్నాడని అతని బంధువులు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పి.చౌడయ్య తెలిపారు.

చంద్రబాబు జమానాలోనే రైతులకు కష్టాలు, కరువు

- పొగాకు ధరల పతనంపై కూటమి స్పందన శూన్యం
- పొగాకు రైతులకు అండగా వైఎస్సార్ సీపీ పోరాటం
- వైఎస్సార్ సీపీ ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: సీఎం చంద్రబాబు గద్దెనెక్కగానే రాష్ట్రంలో కరువు పరిస్థితులు, రైతులకు కష్టాలు వస్తున్నాయని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు విమర్శించారు. మంగళవారం ఒంగోలులోని జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పొగాకుకు గిట్టుబాటు ధర లేక రెండు నెలలుగా రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారని, కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. పొదిలి పొగాకు వేలం కేంద్రానికి వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన ఖరారు కాగానే సీఎం చంద్రబాబు, మంత్రుల బృందం ఆగమేఘాలపై స్పందించడాన్ని ఎండగట్టారు. అవసరమైతే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించుతామని సీఎం మౌఖికంగా ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతులకు అవసరమయ్యే మార్క్‌ఫెడ్‌తో కొనుగోళ్లు చేయించాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. వైఎస్ జగన్ లేవనెత్తే వరకు రాష్ట్రంలో ఏ సమస్యలూ ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. మిర్చి ధరలు పతనమై ఇబ్బంది పడుతున్న రైతులను గుంటూరు మిర్చియార్డులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించిన తర్వాత మార్క్‌ఫెడ్‌తో కొనుగోలు చేస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు ఇప్పటి వరకు జీఓ ఇవ్వలేదని విమర్శించారు.



మాట్లాడుతున్న చుండూరి రవిబాబు

రైతులు పెట్టుబడి కోసం చేసిన అప్పులకు వడ్డీ పెరుగుతోందని, గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని సూచించారు.

పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా ధర పడిపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రెండు నెలలు నుంచి టుబాకో బోర్డు అధికారులు సైతం రైతులకు అబద్ధాలు చెబుతూ మభ్యపెడుతున్నారని విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించడంతో పాటు పొగాకు కంపెనీలతో సమావేశం నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించితే లాభాలే తప్ప నష్టాలు వచ్చే అవకాశమే లేదన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం మౌనంగా ఉందంటే వ్యాపారులకు లాభాలు తెచ్చిపెట్టే ఎత్తుగడ కాక మరేమిటని నిలదీశారు. రైతులను మోసం చేస్తే చరిత్ర హీనులు కావడం ఖాయమన్నారు. పొగాకు రైతుల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాడుతుందని, ప్రభుత్వం మెడలు వంచి గిట్టుబాటు ధర దక్కేలా చూసే బాధ్యత పార్టీ తీసుకుంటుందన్నారు. రైతులు ధైర్యంగా ఉండాలని, పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రైతులను గ్రూపులుగా విడదీయడం, గట్టిగా నిలదీసేవారి బేళ్లు కొనడం, పేద రైతుల బేళ్లు తిరస్కరించడం టుబాకో బోర్డు అధికారులకు సరికాదన్నారు. బోర్డు అధికారుల మీద నమ్మకం పోతే రైతులు తిరగబడే రోజులు వస్తాయని హెచ్చరించారు.

మహిళలు సమాజ చోదకులు



బ్యాంకర్ల రుణ ప్రణాళిక పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన ఎల్‌డీఎం, బ్యాంకర్లు

- స్వయం సహాయక సంఘాలకు బ్యాంకర్లు సహకరించాలి
- డీఆర్‌డీఏ, మెప్మా, బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: మహిళలు కుటుంబ, సమాజ చోదక శక్తిగా ఎదగాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బ్యాంకర్లు కూడా స్వయం సహాయక సంఘ సభ్యులకు రుణాలు మంజూరు చేసి అండగా నిలవాలని కోరారు. డ్వాక్రా మహిళలకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఇచ్చే వార్షిక రుణ, జీవనోపాధి కార్యాచరణ ప్రణాళికపై మంగళవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాల్లో డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు, బ్యాంకర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 4.5 లక్షల మంది స్వయం సహాయక సంఘ మహిళలు ఉన్నారని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళా వ్యాపారవేత్తగా తయారు కావాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. డీఆర్‌డీఏతో బ్యాంకర్లు సమన్వయం చేసుకోవాలని సూచించారు. బోగస్ గ్రూపులను, రుణాలు తీసుకోవడంలో డూప్లికేషన్‌ను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్ అందుబాటులోకి తెచ్చిందన్నారు. మహిళలు పొదుపు చేసుకున్న డబ్బులో 10 శాతం నిల్వ ఉంచి మిగతా నిధులను వారికే రుణంగా మంజూరు చేయాలని స్పష్టం చేశారు. లక్ష మంది మహిళా వ్యాపారవేత్తలను తయారు చేసే క్రమంలో జూన్ 5వ తేదీ నాటికి జిల్లాలో 1,720 యూనిట్లు అందుబాటులోకి రావాలనేది రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యమని చెప్పారు. ఇందుకుగాను రూ.23 కోట్ల రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు. ఈ ఏడాది డ్వాక్రా సంఘాలకు రూ.6759.13 కోట్ల మేర రుణాలు మంజూరు చేయాల్సి ఉందన్నారు. అనంతరం కొత్త యూనిట్ల ఏర్పాటుకు మంజూరైన రుణాల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. 2025–26 ఆర్థిక సంవత్సర వార్షిక రుణ ప్రణాళిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్, ఎల్‌డీఎం రమేష్ మాట్లాడుతూ.. త్వరగా సబ్సిడీ క్రెడిట్ అయ్యేలా పీఎంఎఫ్ఎంఈ పథకం కింద యూనిట్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని డీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. డీఆర్‌డీఏ పీడీ నారాయణ మాట్లాడుతూ.. ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఇచ్చే వ్యక్తిగత రుణాలకు డీఆర్‌డీఏనే ష్యూరిటీ ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మెప్మా పీడీ శ్రీహరి, డీపీఎంలు, ఏపీఎంలు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

జైలు జీవితం మార్పునకు నాంది పలకాలి

- జిల్లా జైలును సందర్శించిన ఎస్పీ ఏఆర్ దామోదర్



జిల్లా జైలును సందర్శిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: జైలు జీవితం కేవలం శిక్షకు మాత్రమే పరిమితం కాదని.. అక్కడి నుంచే సానుకూల మార్పునకు నాంది పలకాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. మంగళవారం జిల్లా జైలును ఆయన సందర్శించారు. జైలు గదులు, హాస్పిటల్, పరిసరాలను పరిశీలించారు. అనంతరం జైలు అంతర్గత భద్రతపై జైలు అధికారులు, సెక్యురిటీ రివ్యూ కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. మహిళా ఖైదీలకు ప్రత్యేక భద్రత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జైలులో నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. రిమాండ్ ఖైదీలను తరలించే సమయంలో పోలీసులు, జైలు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎస్పీ వెంట జైలు సూపరెండెంట్ పి. వరుణా రెడ్డి, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, తాలుకా సీఐ విజయ కృష్ణ, టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, వన్ టౌన్ సీఐ నాగరాజు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఆర్ఐ సీతారామి రెడ్డి, జిల్లా జైలర్ రమేష్, ఎం.శ్రీనివాసరావు, ఎన్. శ్రీనివాసరావు, కారాగార వైద్యాధికారి యస్‌వియస్ బ్రహ్మతేజ తదితరులు వున్నారు.